## మినీకథ

# మూగరాగాలు




ఇరుగు పొరుగు యిళ్ళల్లో కాపురాలు వుంటున్న ఇందిరా పద్మజల కలిసికట్టు తనాన్ని చూసినవాళ్ళు "ఇరుగు పొరుగు అంటే 'ఇలా' వుండాలి" అనుకోకుండా వుండలేరు.

ఇందిరకు రకరకాల కుట్లు, అల్లికలు వచ్చు. పద్మజ వీణ వాయించడంలో సిద్ధ హస్తురాలు. వాళ్ళ స్నేహబంధంలో ఆరు నెలలయ్యేసరికి పద్మజకు అన్ని కుట్లు,అల్లికలు వచ్చేశాయి.ఇందిర అద్భుతంగా వీణ వాయిస్తోంది.

మరి అంతటి సాన్నిహిత్యం వారిద్దరిది. అంతేకాదు. తెల్లవారి లేచింది మొదలు రాత్రి నిద్రపోయేలోపల వాళ్ళు ఎన్నిసార్లు కలుసుకుంటారో. ఎన్నెన్ని కబుర్లు చెప్పు కుంటారో లెక్కించలేము.

భర్తలు ఆఫీసులకు వెళ్ళేకైతే ఓ యింటి కెప్పుడూ తాళంవేసే వుంటుంది.

వాళ్ళ స్నేహానికి ప్రకృతి కూడా పుల కించిందేమో! ఇద్దరికీ ఒకేసారి మాతృత్వాన్ని ప్రసాదించింది. ఇంకో చిత్రం ఇద్దరికీ అమ్మాయిలే. ఒకేసారి పురిటికని పుట్టింటికి వెళ్ళి పండంటి పసిపాలతో ఒకేసారి తిరిగి వచ్చేరు.

ఇద్దరూ కలుసుకున్నాకనే ఇద్దరికీ నచ్చిన పేర్లు ఆ చిన్నారులకు పెట్టుకున్నారు.

వాళ్ళిద్దరి మైత్రిబంధం కన్నా, స్వర్ణ సువర్ణల బోసినవ్వుల చెలిమి యింకా గొప్పది. ఆ చిలిపి కళ్ళ పలకరింపులో తొణికిసలాడే స్నేహం సాటిలేనిది. ఒక్కొక్కప్పుడు ఇందిరా పద్మజల శ్రీవార్లు ఆ ఇద్దరిలో తమ బిడ్డ ఎవరో పోల్చుకోవడానికి కాస్త తికమకపడాల్సివస్తుంది. ఎందుకంటే ఒకే గౌన్లు తొడిగి, ఒకేమాదిరి ముస్తాబు చెయ్యడం ఆ తల్లుల వేడుక.

ఆ చిన్నారులిద్దరూ తరచుగా ఒకే ఇంట్లో వుంటారు. వాళ్ళతో ఎక్కువ పరిచయంలేని వాళ్ళు ఇద్దరూ ఒక తల్లి బిడ్డలని, కవలలని పొరబడుతుంటారు.

నెలలు గడుస్తున్నకొద్దీ ఆ పాపాయిలు చిలిపి చేతలతో ఆ తల్లులను మురిపిస్తున్న కొద్దీ ఇందిరా, పద్మజలకు ఎన్నెన్నో ముచ్చట్లు.

ఆ స్నేహ క్షీరఘటంలో వున్నపాటున ఉప్పురవ్వ పడింది. ఫలితంగా తియ్యని, కమ్మని ఆ పాలు విరిగిపోయాయి. ఏ రుచీ లేకుండా చప్పబడిపోయాయి.

ఇప్పుడు ఇందిర పద్మజముఖం చూడదు. ఇందిర యెదురైతే తటాలున తలుపేసు కుంటుంది పద్మజ.

ఇంతకీ ఆ పాలల్లో పడిన ఉప్పురవ్వ ఏమంత ఘనమైందికాదు. సిల్లీ నాన్సెన్స్!

పద్మజ దగ్గర పావుకిలో పంచదార బదులు తీసుకుంది ఇందిర. ఇవ్వటం మరచిపోయి యిచ్చేశా ననుకుంది. బదులు తీర్చమని పద్మజ అడిగినప్పుడు ఆమెతో అలాగే అంది.

"పావుకిలో పంచదారకోసం పోట్లాడడం కాదు గానీ....నువ్వు బదులు తీర్చలేదు."

"కావాలంటే పూర్తిగా ఒక కిలో పంచదార ఇచ్చేస్తానుగానీ.... నేను నీ బదులు తీర్చేశాను".

ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగింది. చిలికి చిలికి గాలివాన అయింది.

ఆ గాలివానలో దృఢంగా అల్లుకున్న వాళ్ళ స్నేహం పందిరి కూలిపోయింది.

అలా వారం రోజులు గడిచిపోయాయి.

ఇందిర పాపాయిని ఊరడిస్తోంది.

"ఏమిటి ఇందూ! ఎప్పుడూ లేనిది పాప ఇలా చికాకు చేస్తోందే?"

"ఏమోనండి.ఐదారు రోజులనుంచి ఇలా చంపుకుతింటోంది. ఒకటే ఏడుపు. పోనీ! జ్వరమా అంటే అదేంకాదు. ఆకలేమో అనుకుంటే పాలు త్రాగేసి కూడా ఇలానే ఏడుస్తోంది".

భర్తకు బదులుచెప్పేసి మళ్ళీ పాపాయిని సముదాయించడంలో మునిగిపోయింది.

సరిగ్గా అదే సమయానికి పద్మజ అదే స్థితిలో వుంది. పొద్దస్తమానం పాప ఏడుపు మానకపోవడం ఆమెను భయభ్రాంతురాలిని కూడా చేసింది.

పద్మజ భర్తతో అంది: "ఇదేం మాయదారి రోగమోనండి! ఇలా ఏడుస్తోంది."

ఆ మాటకతను "సాయంత్రం రెడీగా వుండు. పాపని హాస్పిటల్‌కు తీసుకు వెళదాము" అన్నాడు.

అనుకున్నట్లే హాస్పిటల్‌కు వెళ్ళేరు. పాపని పరీక్షించిన డాక్టర్‌కూడా ఆశ్చర్య పోయాడు.

"ఏ రోగమూలేదు. కారణం నాకూ అంతుపట్టడంలేదు. ఆరోగ్యంగావున్న ఈ పాపకు ఏమందులని యివ్వనూ?" అనే శాడు.

నిరాశగా అడుగు లేసుకుంటూ యింటి ముఖం పట్టిన ఆ దంపతులకు దారిలో ఎదురైంది ఇందిర, భర్తా, పాపతోసహా!

ఇందిరా, పద్మజలు ముఖాలు చాటు చేసుకొనేలోగానే వాళ్ళ చేతుల్లోని పాపాయిలు ఒకరిపైకి మరొకరు ఉరికినంత పని చేశారు. ఫకాలున నవ్వుకుంటూ నవ్వేసుకుంటూ పలకరించుకున్నారు. ఆ పసపాపల ముఖాలలో విరిసిన ఆ పసిడికాంతులు ఎవరికీ వర్ణింప శక్యంకాదు. చూసిన ఆ తల్లులకు అర్థమైంది. తమ బిడ్డలు ఎందుకోసం ఇలా తల్లడిల్లిందీ!

"ఇంక హాస్పిటల్‌కు వెళ్ళక్కర్లేదండి. ఇంటికి వెళ్ళిపోదాం పదండి" తన పాపను పద్మజ చేతికి అందించి ఆమె చేతుల్లోని పాపను తను తీసుకుంటూ అంది ఇందిర.

ప్రేమగా ఇందిర పాప నెత్తుకున్న పద్మజ స్నేహపూర్వకంగా ఆమె చేయి పట్టుకుంది. ఆ పసికూనల మూగరాగాలు వాళ్ళ తప్పిదాన్ని తెల్పి ఆ తల్లుల హృదయాలను మళ్ళీ కలిపేశాయి. ●

సత్యవాడ సోదరీమణులు